## క్లుప్తంగా

### ఏటంగూడలో 'ఫ్యామిలీ డాక్టర్'

భామిని: మండలంలోని ఏటంగూడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. భామిని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఫణికుమార్, సిబ్బంది పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యసేవలు అందజేశారు.

### కొలతల ప్రకారమే ఆక్రమణల తొలగింపు



కురుపాంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

కురుపాం: కొలతల ప్రకారమే ఆక్రమణలు తొలగిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో కొన్నిచోట్ల కొలతల మేర ఆక్రమణలు తొలగించడం లేదన్న స్థానికుల ఆరోపణలపై సదరు అధికారులు స్పందించారు. రోడ్డుకు ఇరువైపులా ఏడు మీటర్ల చొప్పున ఆక్రమణలు తొలగించాల్సి ఉందని, బస్టాండ్ కూడలి వద్ద ఆర్అండ్‌బీ, అటవీ శాఖ స్థలాలను ఆక్రమణదారులు ఆక్రమించి, కట్టుకున్న కట్టడాలను కూడా తొలగిస్తామని తెలిపారు.

### మలేరియా నియంత్రణే లక్ష్యంగా చర్యలు



మాట్లాడుతున్న ఎన్‌వీబీడీసీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

కురుపాం: మలేరియా నియంత్రణే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని ఎన్‌వీబీడీసీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆయన మలేరియా కేసుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం వైద్యాధికారిణి ఆశా కృష్ణతో మాట్లాడి, మలేరియా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మలేరియా కన్సల్టెంట్ జి.రామచంద్ర, ఎంఈఓ సూర్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన హనుమాన్ జయంత్యుత్సవాలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: స్థానిక దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న హనుమాన్ జయంత్యుత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బల్లంకి వీధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

### వినతిపత్రం అందజేత

సీతంపేట: పాలకొండ మండలంలోని లుంబూరు-కోటిపల్లి మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇదే విషయమై ఆయన ఐటీడీఏ పీఓ కల్పనాకుమారిని మంగళవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి చేస్తే ఆయా గ్రామాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. పాలకొండ నుంచి పెదకోటిపల్లి, చిన్నకోటిపల్లి, గుడివాడ, లుంబూరు గ్రామాల మధ్య ప్రజా రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కూడా సులభతరమవుతుందన్నారు. అలాగే ఎరకంపేట, మల్లీవీడు, చంద్రయ్యవలస, పాలకొండల మధ్య దూరం 6 నుంచి 7 కిలోమీటర్ల వరకు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో లుంబూరు గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

# మేమంతా పాలకులం కాదు మీ సేవకులం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: మేం పాలకులం కాదు మీ సేవకులమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాకు ఓటు వేసి గెలిపించిన మీ బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా తమపై ఉందని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఇంటింటికీ పంపిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమిస్తూ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని, గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలే దీనిని నిదర్శమని ఉదహరించారు. ఆయా వ్యవస్థల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలతో పాటు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, దీనికి కారణం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడమేనన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, సర్పంచ్ కునుతుల పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు బుగత అమృతరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, పార్టీ నాయకులు బౌరోతు రాజశేఖరరావు, కొరికాన గంగునాయుడు, సన్యాసినాయుడు, పట్నాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపలో 'సంక్షేమ' సంతోషం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతీ గడపలో సంక్షేమ సంతోషం నెలకొందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బురదవెంకటాపురం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన పథకాలు అమలు చేస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఆయన తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్రలో చూసిన, విన్న ప్రజల కష్టాలను తీర్చేందుకు ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే దక్కేవన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. అర్హులైన వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలని, దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే పథకం మంజూరవుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని చంద్రబాబు అండ్ కో సర్కారుపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ, మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ చింతల రూపవతి, వైస్ ఎంపీపీ బి.లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

# వలంటీర్లు సంక్షేమ సారథులు

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



భామిని: వలంటీర్లతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



పాలకొండ రూరల్: సత్కారం పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

భామిని: వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు, సంక్షేమ సారథులు కూడా వారేనని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రశంసించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వలంటీర్లను సన్మానించి, వారి సేవలను అభినందించారు. అందరి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాల కింద రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు అందజేసి, సత్కరించడం చాలా గొప్ప విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కో-ఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ జి.రమేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని సింగుపురం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొమ్మాళి భాను ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైన వారిని సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. మున్ముందు కూడా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని వలంటీర్లకు ఎంపీపీ సూచించారు. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రణస్థలం రమాదేవి, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, సర్పంచ్‌లు వెంకయ్య, ఆరిక వెంటేష్, జి.కృష్ణారావు, ఎంపీటీసీలు నిమ్మక దుర్గమ్మ, పాండ్రి హైమావతి, కో-ఆప్షన్ సభ్యులు మురళి, సిమ్మినాయుడు, గౌరినాయుడు, ఎంపీడీఓ డొంక త్రినాధులు తదితరులు పాల్గొన్నారు.

### బిటివాడ విద్యుత్ ఫీడర్‌ను విభజించాలి

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బిటివాడ విద్యుత్ ఫీడర్‌ను విభజించాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఫీడర్ 12 పంచాయతీలను కలుపుతూ వెళుతోందని, అన్ని ఫీడర్ల కన్నా బిటివాడ ఫీడర్ పెద్దదిగా ఉండడంతో బ్రేక్‌డౌన్ల సమయంలో పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు, వీచిన ఈదురుగాలులకు ఈ ఫీడర్ బ్రేక్‌డౌన్ కావడంతో ఫీడర్ పరిధిలోని చిదిమి, పాలమెట్ట, గడగమ్మ, కొట్టుగుమ్మడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని వివరించారు. సమస్య ఎక్కడ ఉందో గుర్తించడం కూడా చాలా ఇబ్బంది అవుతోందని లైన్‌మెన్లు కూడా అంటున్నారని, ఫీడర్‌ను విభజిస్తే సమస్య గుర్తింపు, పరిష్కారం సులభతరమవుతుందన్నారు.

### సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



గౌతమ్‌నాయుడు

పాలకొండ రూరల్: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండలంలోని పనుకువలసకు చెందిన కోట గౌతమ్ నాయుడు ప్రతిభ కనబరిచాడు. మంగళవారం విడుదలైన నాలుగో విడత ఫలితాల్లో 300 మార్కులకు 244 మార్కులు సాధించి, ఆలిండియా లెవెల్‌లో 4,225వ ర్యాంక్ సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు అజయ్‌కుమార్, కళావతి తెలిపారు. తమ కుమారుడికి జార్ఖండ్‌లోని తిలియా సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి అవకాశం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

### భూ సమస్యలు పరిష్కరించాలి



చిన్నదిమిలిలో భూ సమస్యపై చర్చిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

భామిని: స్థానికుల సహకారంతో భూ సమస్యలు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. మండలంలోని చిన్నదిమిలి, కోసలి, కీసర గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై స్పందనలో గ్రామస్తులు సమర్పించిన వినతుల నేపథ్యంలో మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించిన సబ్‌కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతర భామిని మోడల్ స్కూల్‌లో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను సబ్ కలెక్టర్ పరిశీలించారు.

# అందరి సహకారంతోనే అభివృద్ధి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. గిరిజనులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న జీడి మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఉపాధి హామీ పనులకు కేటాయించిన నిధుల వివరాలు ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని, గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్‌ను తొలగించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండల అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ జె.రాములమ్మ పాల్గొన్నారు.

# గవరమ్మపేటలో గజరాజుల సంచారం



గవరంపేట సమీపంలోని మెయిన్‌రోడ్డుపై నడిచి వెళ్తున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరంపేట సమీపంలో గజరాజుల గుంపు సంచరిస్తోంది. అక్కడి పార్వతీపురం-కురుపాం రోడ్డు మీదుగా వెళ్తున్న ఏనుగులను అటువైపుగా వెళ్తున్న వారు ఉదయం చూసి, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏ గ్రామంలోకి వచ్చి, దాడులు చేసాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, అవి గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేయండి

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ బి.సూర్యనారాయణ



పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ సూర్యనారాయణ

సీతంపేట: పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మండలంలోని మల్లి, హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గిరిజన సంక్షేమ శాఖ డీడీ బి.సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా వారిని సన్నద్ధం చేయాలని సూచించారు.ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ముందస్తు పరీక్షలు నిర్వహించి, వారి విద్యాసామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. అనంతరం మండలంలోని శిలిగాం, లోవగూడ, అక్కన్నగూడ గ్రామ పాఠశాలల్లో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను పరిశీలించి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ మంగవేణి, హెచ్‌ఎంలు పి.నారాయుడు, ఉమావాణి తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేను వేగవంతం చేయండి

- పార్వతీపురం ఆర్‌డీఓ హేమలత



గొట్టివలసలో సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌డీఓ హేమలత



పాలకొండ: సర్వే వివరాలను ల్యాప్‌టాప్‌లో పరిశీలిస్తున్న జనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ పరిపాలన అధికారి నాగరాజు


గరుగుబిల్లి: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని పార్వతీపురం ఆర్‌డీఓ హేమలత సూచించారు. మండలంలోని గొట్టివలస, గరుగుబిల్లి, చినగుడబ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించిన ఆమె సర్వే జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేకు ముందు గ్రామంలో సర్వే జరుగుతున్నట్లు దండోరా వేయించాలని తెలిపారు. సర్వే వేగవంతానికి మండలానికి 10 మంది చొప్పున ఇతర మండలాల నుంచి కేటాయించడం జరిగిందన్నారు. సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు రైతుల సమక్షంలోనే పక్కాగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ అజురఫీజాన్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: భూముల రీసర్వేలో భాగంగా స్థానిక కొండవీధి సమీపంలో చేపడుతున్న డ్రోన్ సర్వేను రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ పరిపాలన అధికారి నాగరాజు మంగళవారం పరిశీలించారు.

అనంతరం ఆయన రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత శానిటరీ, పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమై, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకులతో బొమ్మలు తయారు చేయిస్తున్న రాంబాబు మాస్టారు



ఐదో తరగతి విద్యార్థి చేతన్ రూపొందించిన సీతాకోకచిలుక చిత్రం





ఐదో తరగతి విద్యార్థి రోహిత్ ఆకులతో చేసిన చేప బొమ్మ

# చిట్టి చేతులు.. అద్భుత చిత్రాలు..



నాలుగో తరగతి విద్యార్థిని యోగితశ్రీ ఆకులతో తయారు చేసిన బొమ్మలు

టీఏఆర్ఎల్(టీచింగ్ ఎట్ ది రైట్ లెవల్) కార్యక్రమంలో భాగంగా వీరఘట్టం మండలం, చిట్టపులివలస గ్రామంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం అందేలా 23 రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఓ రోజు పిల్లలతో పుస్తకాలు చదివిస్తే, మరో రోజు ఆటపాటలతో చిన్నారుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ప్రతిరోజూ సరికొత్త కార్యక్రమంతో కొనసాగే ఈ తరగతులకు విద్యార్థులు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తుండడం విశేషం. మంగళవారం ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు పర్యవేక్షణలో చిన్నారులు ఆకులతో రూపొందించిన పలు చిత్రాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఈ కృత్యం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. -సాక్షి నెట్‌వర్క్

### విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఏఈ బి.శంకరరావు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షం, వీచిన భారీ ఈదురుగాలులకు తలెత్తిన విద్యుత్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, మరే విద్యుత్ సమస్య వచ్చినా తమ సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు ఎటువంటి డబ్బులు ఎవ్వరికీ ఇవ్వనవసరం లేదన్నారు.